## సబ్ కలెక్టర్‌ను కలిసిన ఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్‌షెట్కార్


సబ్ కలెక్టర్‌ను కలిసిన నగేష్ షెట్కార్

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన నగేష్ షెట్కార్ సబ్ కలెక్టర్ ఉమా హారతి గారిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈసందర్భంగా సబ్ కలెక్టర్ గారు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మున్సిపల్ అభివృద్ధి కోసం సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు కె.శ్రీనివాస్, మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాహిర్ అలీ,స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
# వార్త

## ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా చైర్మన్ ఎన్నిక

### సవ్యవంగా మరోసారి ఎన్నిక నిర్వహించాలి..
### బిఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిని కాటా స్రవంతి

**జహీరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** మంగళవారం జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక ఎన్నికల కమిషన్‌కు విరుద్దంగా నిర్వహించి, నియామావళిని పాటించకుండా నిర్వహించారని బిఆర్ఎస్ తరఫున చైర్మన్‌గా పోటీచేసిన కాటా స్రవంతి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి రాసిన లేఖలో పేర్కొన్నారు. చైర్మన్ ఎన్నికను మున్సిపల్ జీఓలకు విరుద్దంగా అధికారులు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ నిర్వహించారని ఆందోళన వ్యక్తం చేశారు. చైర్మన్ బరిలో ఉన్న అభ్యర్థుల పేర్లను ఆల్ఫాబెటికల్‌గా పిలువకుండా కాంగ్రెస్ చైర్మన్ అభ్యర్థి యూనూస్‌ను ముందుగా పిలవడంతోనే ఓటమి చవికూడాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం అల్ఫాబెటికల్‌గా తన పేరు ముందు ఉంటుందని, అలాకాకుండా కాంగ్రెస్‌కు వత్తాసు పలుకుతూ నిబంధనలు తుంగలో తొక్కి నిర్వహించిన ఎన్నికలను రద్దుచేసి మరోసారి చైర్మన్ నిర్వహించాలని స్రవంతి డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న మంత్రి అజారుద్దీన్, ట్రీమీస్‌చైర్మన్ ఫహీం,ఎంపి షెట్కార్

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

### -మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్

**జహీరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుందని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, టీమీస్ చైర్మన్ ఫహీం ఖురేషి, ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా నియోజకవర్గ కేంద్రమైన జహీరాబాద్‌లో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నికల అనంతరం అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జహీరాబాద్, కోహీర్ మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జండా ఎగరడం ఆనందంగా ఉందన్నారు. జహీరాబాద్, కోహీర్ మున్సిపాలిటీలను సిఎం సహకారంలో అన్ని రంగాల్లో ముందుండేలా చేస్తామని చెప్పారు. సమావేశంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, సెట్విన్ చైర్మన్ నందారం గిరిధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనూస్, వైస్ చైర్మన్ కొత్తకాపు శిరీష, నాయకులు ఉజ్వల్‌రెడ్డి, మహ్మద్ తన్వీర్, కాంగ్రెస్ కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సమగ్ర సవరణను వేగవంతం చేయాలి : అడిషనల్ కలెక్టర్ మాధురి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ మాధురి

**సంగారెడ్డి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** ఓటర్ల జాబితా సవరణకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ మాధురి సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, ఈఆర్‌ఓలతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో ఎలాంటి తప్పిదాలు లేకుండా మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేయాలన్నారు. బిఎల్‌ఓలు మ్యాపింగ్ ప్రక్రియకు క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు. ఈఆర్‌ఓలు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సమగ్రంగా పర్యవేక్షించి, వేగంగా పూర్తయ్యేలా సహకరించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత అధికారులతోకలిసి వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ మాధురి మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పూర్తి చేస్తామని తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు సూపర్వైజర్లు, బిఎల్‌వోలు అంకితభావంతో పనిచేసేలా సంబంధిత మండలాల అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, డీఎం సివిల్ సప్లై అంబాదాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తహసిల్దార్ లు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చర్లఅంకిరెడ్డిపల్లిని సందర్శించిన గ్రూప్ వన్ అధికారులు


గ్రామంలో పర్యటిస్తున్న గ్రూప్ వన్ అధికారులు

**చిన్నకోడూరు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చర్ల అంకిరెడ్డిపల్లి గ్రామాన్ని మంగళవారం గ్రూప్ వన్ అధికారులు శిక్షణ కార్యక్రమంలో భాగంగా సందర్శించారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులతీరు, సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించి రోడ్లు, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్య నిర్వహణ, పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలు సేకరించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయాలు, సూచనలను తీసుకున్నారు. ప్రజలతో ప్రత్యక్ష సంభాషణ ద్వారా వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవడంలో ట్రైనింగ్‌లో కీలక భాగమని తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ అధికారులు జెస్సీ పాల్ సురారపు, బోయ ఉజ్వల, బానోతు నరేందర్, సాత్విక్ నాయక్, నిఖిల, నికితరెడ్డి ప్రణయ్‌సాయి, సర్పంచ్ గాలిపల్లి అనిల్, ఉపసర్పంచ్ నాగరాజు, తహశీల్దార్ సలీం, ఎంపిడివో జనార్ధన్, పిఆర్ డిఈ బ్రహ్మం, పశువైద్యాధికారి మంజుల, వ్యవసాయ అధికారి జయంత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి గీతాంజలి, ఉద్యానవనశాఖ అధికారి రమేష్, ఆర్ఐ మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

## ఎంపిని కలిసిన బిజెపి కౌన్సిలర్లు

**సంగారెడ్డి మున్సిపాలి ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** సంగారెడ్డి మున్సిపాలిటీలో బీజేపీ కౌన్సిలర్‌లుగా గెలిచిన కొండాపురం జగన్, నాయకోటి స్వాతి రమేష్‌లు మంగళవారం మర్యాదపూర్వకంగా మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావును కలిశారు. ఆయన నూతన కౌన్సిలర్లకు శాలువాతో సన్మానించి సీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.


ఎంపిని కలిసిన బిజెపి కౌన్సిలర్‌లు

# గ్రామ పాలన వ్యవస్థను అధ్యయనం చేయాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి


మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రామ పాలన వ్యవస్థను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని మొదటి బ్యాచ్ గ్రూప్-1 అధికారులకు జిల్లా కలెక్టర్ కె.హైమావతి సూచించారు. రెండు రోజులు జిల్లాలోని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో గ్రామ పాలన వ్యవస్థల పనితీరును, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును క్షేత్ర స్థాయిలో పరిశీలించి మంగళవారం జిల్లాకు చేరుకున్న ప్రొబిషనరీ డిప్యూటీ కలెక్టర్లు, డిఎస్పీలు, ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, కమర్షియల్ టాక్స్ ఆఫీసర్లు, గ్రేడ్-2 మున్సిపల్ కమిషనర్లు 37 మందితో కూడిన గ్రూప్ వన్ మొదటి బ్యాచ్ అధికారులకు కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు ఆయా శాఖల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవల వివరాలను కలెక్టర్‌కు తెలియజేశారు. గ్రామ పంచాయతీల ద్వారా గ్రామ పాలన వ్యవస్థ పనితీరు, తాగునీటి సరఫరా, గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత, గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా స్థానికంగా ఉపాధి, మహిళా సంఘాలకు ఐకెపి ద్వారా ప్రోత్సాహం, వైద్యఆరోగ్య సేవలు, అంగన్‌వాడీ ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం, పూర్వ ప్రాథమిక విద్య విధానం, పాఠశాల విద్య, గురుకులాలు, ఇతర సంక్షేమ వసతి గృహాలు, జాతీయ,రాష్ట్ర గ్రామీణ మున్సిపల్ రహదారులు, వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధి, మార్కెటింగ్ తదితర అంశాలపై ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి గ్రామాలు ప్రతిరూపమన్నారు. గ్రూప్ వన్ అధికారులు భవిష్యత్‌లో ప్రజలకు మంచి పాలను అందించేందుకు క్షేత్రస్థాయి పర్యటన చాలా ఉపయోగపడుతుందన్నారు. గ్రామీణ పరిపాలన విధానాన్ని గ్రామ పంచాయతీలకు వచ్చే ఆదాయం, ప్రజల సేవ కోసం చేసే వ్యయం వివరాలను ప్రత్యక్షంగా పరిశీలించాలన్నారు. అన్ని రకాల రికార్డులను గ్రామపంచాయతీ పరిధిలో పరిశీలించాలని చెప్పారు. తాగునీటి సరఫరాలో ముఖ్య పాత్ర పోషిస్తున్న మల్లన్నసాగర్ వద్ద మంగోల్‌లో ఉన్న దేశంలోనే అతిపెద్ద గ్రామీణ ప్రాంతాలకు తాగునీటిని అందించే వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను పరిశీలించాలని, దాని పక్కనే హైదారాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేసుందుకు చేస్తున్న ఏర్పాట్లు పరిశీలించాలని సూచించారు. అనంతరం మొదటి బ్యాచ్ గ్రూప్ వన్ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హామీద్, డిఆర్వో నాగరాజమ్మ, డిఆర్‌డిఏపిడి జయదేవ్‌ఆర్య, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


నర్సాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూంలను పరిశీలిస్తున్న రాహుల్‌రాజ్

## పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**నర్సాపూర్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్రూంలలో పెండింగ్ పనులు పూర్తిచేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నర్సాపూర్‌లో ఉన్న డబుల్ బెడ్రూంలను జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, హౌసింగ్ డిఈతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ నర్సాపూర్‌లోఉన్న డబుల్ బెడ్రూంలలో పెండింగ్ ఉన్న పనులు పూర్తి చేయాలన్నారు. డబుల్ బెడ్రూంలలో పెండింగ్ ఉన్న పనులు పూర్తయిన అనంతరం అర్హతగల లబ్దిదారులను గుర్తించాలన్నారు.

## అక్రమార్కుల అడ్డా.. ఉపాధి హామీ పథకం

### నకిలీ పనులు, నకిలీ హాజరుతో డబ్బులు కాజేత

**కొండాపూర్ ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** ఉపాధి హామీ పథకం కొందరు అధికారులకు జేబులు నింపుకునే అడ్డాగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనుల పేరుతో నకిలీపనులు, హాజరు నమోదు చేసి కూలీ డబ్బులు కాజేస్తున్నారనే ఆరోపణలతో కొండాపూర్‌లో నిర్వహించిన సామాజిక తనిఖీలో అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై అడిషనల్ డిఆర్‌డిఓ బాల్‌రాజ్, విజిలెన్స్ అధికారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో పలు గ్రామాల్లో 30 మంది చేసేపనిని 50 మంది చేసినట్లు రికార్డుల్లో చూపించి నిధులు కాజేస్తున్నట్లు గుర్తించారు. పనులకు వెళ్లని కార్మికుల పేర్లను హాజరు పట్టికల్లో నమోదు చేసి కూలీ డబ్బులు మింగేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి.పనుల్లో నాణ్యత లేకపోవడం, మొక్కల పెంపకం, గుంతల తవ్వకం వంటి పనుల్లో అతి తక్కువ పనితో ఎక్కువ బిల్లులు వేసుకోవడం ద్వారా ప్రభుత్వ నిధులను గుంజుతున్నారని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపిఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పరస్పరం చేతులు కలిపి అక్రమాలకు పాల్పడుతున్నారని, ఎన్నిసార్లు హెచ్చరించినా మారడం లేదని అడిషనల్ డీఆర్‌డీఓ బాల్‌రాజ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గ్రామాల ప్రజలు మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం పేదల కోసం కాకుండా అక్రమార్కుల కోసం మారిపోయిందని మండిపడ్డారు. కార్యక్రమం లో ఎంపీడీఓ సౌమ్యశ్రీ, ఏపిఓ వీరప్ప, సర్పంచ్లు మహేశ్, నంగమేశ్వర్, మహేశ్వరీ సతీష్, పంచాయితీ కార్యదర్శులు రజిని, శాంతిప్రియ, అరుణ పాల్గొన్నారు.


రికార్డులను తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు


మాట్లాడుతున్న ఎంపిడివో

## మొదలైన నూతన వార్డు సభ్యులకు శిక్షణ

**హుస్నాబాద్ రూరల్ , ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నూతనంగా ఎన్నికైన 7 గ్రామాల వార్డు సభ్యులకు మొదటి బ్యాచ్‌కి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పాలన మరింత సమర్థవంతంగా సాగేందుకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన అవగాహన కల్పించడమే ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో రమేష్ ప్రారంభిస్తూ మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన వార్డుసభ్యులు తమ బాధ్యతలను పూర్తిస్థాయిలో అర్థంచేసుకొని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. గ్రామ అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజా సమస్యల పరిష్కారంలో వార్డుసభ్యుల పాత్ర అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి జి.మోహన్ గారు మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ వ్యవస్థ, పాలనా విధానాలు, అభివృద్ధి పనుల అమలు, నిధుల వినియోగంపై వివరంగా అవగాహన కల్పించారు. అలాగే మండల పరిషత్ పర్యవేక్షకులు శ్రీ శంకర్ గారు వార్డు సభ్యుల విధులు, బాధ్యతలు, అధికారుల సమన్వయంతో ఎలా పనిచేయాలనే అంశాలపై స్పష్టత ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వార్డు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఇలాంటి శిక్షణలు గ్రామ పాలనకు ఎంతో ఉపయోగపడతాయని, భవిష్యత్తులో మరిన్ని బ్యాచ్‌లకు కూడా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## పేదల సమస్యలు పరిష్కరించిన అధికారులను ప్రజలు మర్చిపోరు : బక్కి వెంకటయ్య

**మిరుదొడ్డి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన పేద ప్రజను ఆదరించి వారి సమస్యలు పరిష్కరించిన అధికారులను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు.మండల పరిధిలోని అల్వాల గ్రామ సందర్శనలో భాగంగా గ్రూప్-1 అధికారులు గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. గ్రామానికి వచ్చిన అధికారులతో పాటు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు సర్పంచన ప్రమీలదేవి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ నూతనంగా నియామకమైన గ్రూప్-1 అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహించి పేద ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామీణ పేద ప్రజల సమస్యలను తెలుసుకోవడం కోసం ఆరుగురు గ్రూప్-1 అధికారులు అల్వాల గ్రామానికి రావడం సంతోషంగా ఉందన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను తెలుసుకోవడంతో పాటు రాష్ట్రంలో అధికారులుగా నియామకం చేపట్టిన తర్వాత పేదవారికి సహాయపడేలా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం గ్రూప్-1 అధికారులు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. గ్రామస్తులు తమపై అభిమానంతో డప్పు, చప్పులతో స్వాగతం పలికిన తీరును వారు అభినందించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


ఇంద్రేశం చైర్మన్ ప్రమీల, వైస్ చైర్మన్ హరీష్‌రెడ్డి

## ఇంద్రేశం మున్సిపాలిటీ బిఆర్ఎస్ కైవసం

### చైర్మన్‌గా కుశంగుల ప్రమీల..వైస్ చైర్మన్‌గా పట్లోళ్ల హరీష్‌రెడ్డి

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ఇంద్రేశం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక ప్రక్రియ మంగళవారం ప్రశాంతంగా జరిగింది. ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం సోమవారం జరగాల్సిన ఎన్నిక కోరం లేకపోవడంతో మంగళవారానికి వాయిదాపడింది. మంగళవారం ఉదయం ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని రామేశ్వరం బండవాడు కార్యాలయంలో చైర్మన్ వైస్‌చైర్మన్ ఎంపిక కార్యక్రమాన్ని ఎన్నికల అధికారులు నిర్వహించారు. ఇంద్రేశం మున్సిపల్ పరిధిలో మొత్తం 18 వార్డులకుగాను బిఆర్ఎస్ పార్టీ 9, కాంగ్రెస్ ఆరు, బిజెపి 2, స్వతంత్రులు 1 గెలిచారు. పోలింగ్ అనంతరం స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన సార లావణ్య బిఆర్ఎస్‌లో చేరారు. దీంతో బిఆర్ఎస్ పార్టీ బలం 10కి చేరడంతో మ్యాజిక్ ఫిగర్ సాధించింది. మంగళవారం జరిగిన సమావేశంలో బిఆర్ఎస్‌కు చెందిన కుశంగుల ప్రమీల చైర్మన్‌గా, పట్లోళ్ల హరీష్‌రెడ్డి వైస్ చైర్మన్‌గా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. అనంతరం వీరిచే ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి నూతన పాలకవర్గానికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడంతో పాటు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పరిపాలన అందించాలని ఆయన కోరారు. మున్సిపాల్టీల అభివృద్ధికి ప్రభుత్వం ఇప్పటికే 15 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, త్వరలోనే పనులు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.

## రామరాజు కృషి వల్లే గోటి తలంబ్రాలు : ఏసిపి

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 17 (ప్రభాతవార్త):** భద్రాచలంలో శ్రీసీతా రాముల కళ్యాణంలో గోటితో ఒలిచిన తలంబ్రాలను వాడడం ఆనవాయితీ కాగా, రామకోటి రామరాజు కృషివల్లే మన ప్రాంతానికి భద్రాచల దేవస్థానం వారు గోటి తలంబ్రాలు అందించడం జరుగుతుందని ఏసిపి నర్సింలు తెలిపారు. గజ్వేల్‌కు చెందిన శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సంస్థకు 4వసారి చోటుకల్పించి 3 క్వింటాళ్ల వడ్లను అందజేయగా మంగళవారం ప్రజ్ఞాపూర్‌లోని పార్థివేశ్వరస్వామి దేవాలయంలో గజ్వేల్ ఏసిపి నర్సింలు వద్దకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏసిపి నర్సింలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి లక్షల మంది భక్తులచే రామనామ స్మరణచేయించి గోటితో వడ్లనుఒలిపించి భక్తితో మూడుసార్లు కళ్యాణానికి అందించడం హర్షణీయమన్నారు. 4వ సారి 3 క్వింటాళ్ల వడ్లను గోటితో ఒలిపించి అందించాలన్న రామకోటి రామరాజు దృఢ సంకల్పం గొప్పదన్నారు. గోటి తలంబ్రాలు అందజేసే బృహత్తర కార్యక్రమం చేపట్టి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న రామకోటి రామరాజును అభినందించారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల నరేష్‌బాబు, తుమ్మ శ్రీను, ప్రొద్దుటూరి భాస్కర్, టెంట్ నర్సింలు, నంగునూరి సత్యనారాయణ, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.


భద్రాచలం నుండి వచ్చిన వడ్లను చూపిస్తున్న ఏసిపి నర్సింలు

## షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

**నర్సాపూర్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఫ్రిడ్జ్ పేలి ఇల్లు దగ్ధమైన సంఘటన మండలపరిధిలోని గొల్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.... గొల్లపల్లి గ్రామానికి చెందిన సార సంతోష చికెన్ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తుంది. మంగళవారం శివ్వంపేటలోని దేవాలయానికి దర్శనం కోసం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి వెళ్లింది. అదే రోజు మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ చోటుచేసుకొని ఫ్రిడ్జ్ ఒక్కసారిగా పేలడంతో ఇంట్లో మంటలు వ్యాపించి వస్తువులు, ఇల్లు కట్టుకునేందుకు తెచ్చి పెట్టుకున్న నగదు మంటలో కాలిపోయాయి. రూ. 5 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని వారు బోరున విలపించారు ఇంటి నుండి పొగలు రావడంతో చుట్టుపక్కల వారు గమనించి అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రభుత్వం తరపున నష్టపోయిన బాధితురాలకు ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని సర్పంచ్ ఉసిరికపల్లి లక్ష్మీ ఆంజనేయులుగౌడ్, గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు..

## 101 కేజీల గంజాయి స్వాధీనం

### ఇద్దరి అరెస్టు

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని కొల్లూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 101 కేజీల గంజాయిని మంగళవారం స్వాధీనం చేసుకున్నామని శేరిలింగంపల్లి డిసిపి సిహెచ్ శ్రీనివాస్ తెలిపారు. కొల్లూరు పోలీసులు, మాదాపూర్ ఎస్‌ఓటి సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన దాడిలో గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బస్వ జగన్నాథం(37), పల్లపు లక్ష్మీనారాయణ(52)లు ఒడిశాకు చెందిన రాజు నుంచి 101.7 కిలోల గంజాయిని తెప్పించుకుని తెల్లాపూర్ పరిధిలోని శిల్పా వెంచర్ సమీపంలోని కార్మికుల క్యాంప్ వద్ద విక్రయించేందుకు నిల్వ చేశారని పేర్కొన్నారు. 25.72 లక్షల విలువ గల గంజాయిని, 4 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఒడిశాకు చెందన ప్రధాన నిందితుడు రాజు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన కొల్లూరు సిఐ గణేష్‌పటేల్, ఎస్‌ఓటి బృందాన్ని అభినందించారు. అక్రమంగా గంజాయిని తరలించినా, నిల్వఉంచినా 100కు డయల్ చేయాలని, సైబరాబాద్ ఎన్‌డీపీఎస్ సెల్ నంబర్ 9490617444కు వాట్సాప్ చేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.


ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

# జహీరాబాద్ మున్సిపల్‌పై కాంగ్రెస్ జండా

### చైర్మన్‌గా మహమ్మద్ యూనుస్, వైస్ చైర్మన్‌గా శిరీష ఎన్నిక.. ప్రమాణ స్వీకారం


మున్సిపల్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకరం చేస్తున్న మహమ్మద్ యూనూస్, వైస్ చైర్మన్ కొత్తకాపు శిరీష

**జహీరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** జహీరాబాద్ మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవశం చేసుకుంది. మంగళవారం జరిగిన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా 15వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ మహమ్మద్ యునూస్‌ను చైర్మన్‌గా 16వ వార్డు కౌన్సిలర్ కొత్తకాపు శిరీషను వైస్ చైర్మన్‌గా కౌన్సిలర్లు ఎన్నుకున్నారు. సోమవారం కోరం లేక వాయిదా పడిన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలను మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు. సమావేశానికి కాంగ్రెస్, ఎంఐఎం, ఇండిపెండెంట్ కౌన్సిలర్‌లతో ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, బిఆర్ఎస్, బిజెపి కౌన్సిలర్లతో ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావులు హాజరయ్యారు. చైర్మన్ ఎన్నికను పురస్కరించుకుని 15వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ యూనుస్ పేరును ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ సూచించగా 16వ వార్డు కౌన్సిలర్ గూనెల్లి కవతి బలపర్చారు. ఓటింగ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మహమ్మద్ యూనూస్‌కు 20 ఓట్లు రాగా బిఆర్ఎస్ తరపున చైర్మన్ బరిలో ఉన్న 27వ వార్డు కౌన్సిలర్ కాటా స్రవంతికి 15 మంది బిఆర్ఎస్ కౌన్సిలర్లు, ముగ్గురు బిజెపి కౌన్సిలర్లు, ఒక ఎక్స్ అఫీషియో(ఎమ్మెల్యే) ఓటుతో 19 ఓట్లు పోలవడంతో 1 ఓటు మెజార్టీతో కాంగ్రెస్‌అభ్యర్థి యూనుస్ చైర్మన్‌గా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. వైస్ చైర్మన్‌గా కొత్తకాపు శిరీషను ఎన్నికైనట్లు ప్రకటించారు. చైర్మన్, వైస్ చైర్మన్‌లకు ఎంపి సురేష్ కుమార్ శెట్కార్, కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఆర్‌డిఓ దేవుజా, మున్సిపల్ అధికారులు పూలబొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల ప్రశాంతంగా ముగిసేలా డిఎస్పి సైదానాయక్ నేతృత్వంలో సిఐ శివలింగం, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది బందోబస్తును నిర్వహించారు.


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

## రాష్ట్రస్థాయి సిఎం కప్ పోటీలకు ఆదర్శ విద్యార్థుల ఎంపిక

**చిన్నకోడూరు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** మండలంలోని ఇబ్రహీంనగర్ పిఎంసి ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థులు సీఎం కప్ 2025 జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటారు. టేబుల్ టెన్నిస్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ విభాగాల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైనవారిలో జస్వంత్, అశ్విత్, అమూల్య(వాలీబాల్), తనుశ్రీ, దివ్యశ్రీ, రక్షిత, వర్షిత్, లిఖిత్, రిషిత్(టేబుల్ టెన్నిస్), దినేష్, అరవింద్(బాస్కెట్‌బాల్), ఆదర్శ్, కుమారస్వామి, నవదీప్ ఉన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 18 నుంచి 23 వరకు హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో మంగళవారం ప్రిన్సిపల్ సతీష్ కుమార్, సర్పంచ్ ములకల వజ్రవ్వ కుంటయ్య, మాజీ సర్పంచ్ సుభాష్ గౌడ్ మరియు పి.డి. గుండి ప్రవీణ్‌లు విద్యార్థులను అభినందించారు.

## కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌పై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాంపిటీటివ్ ఎగ్జామ్స్ సెల్ ఆధ్వర్యంలో, కరీంనగర్‌కు చెందిన ఏసీ రెడ్డి కోచింగ్ సెంటర్ సహకారంతో రాబోయే కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపల్, ప్రొఫెసర్ డా. అనిల్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఏసీ రెడ్డి కోచింగ్ సెంటర్ డైరెక్టర్ జె.అంజయ్యచారి, ఫ్యాకల్టీ సభ్యులు జి.హరికాంత్, మహేష్‌కుమార్ పాల్గొని కాంపిటీటివ్ పరీక్షల సన్నద్ధత, విధివిధానాలపై అవగాహన కల్పించారు. కాంపిటీటివ్ ఎగ్జామ్స్ సెల్ కన్వీనర్ డా. వి.చంద్రమౌళి విద్యార్థులు సెల్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరగా, ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెయింటర్ యూనియన్ మండల కమిటీ ఎన్నిక


నూతన అధ్యక్ష కార్యదర్శులను సత్కరిస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో మంగళవారం పెయింటర్ యూనియన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షులుగా దండు రమేష్, ఉపాధ్యక్షులుగా ఏర్పుల కనకరాజు, ప్రధాన కార్యదర్శిగా మాసంపల్లి కృష్ణ, సహా కార్యదర్శిగా కర్రోళ్ల స్వామి, కోశాధికారులు లింగంపల్లి సురేష్, మాట్ల ఉపేందర్‌లతో పాటు కమిటీ సభ్యులుగా వడ్డూరి రవి, లింగంపల్లి పరశురాములు, లింగంపల్లి రవి, నోట్ల కృపాకర్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కమిటీ యూనియన్ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

## నూతన కార్మిక కార్యవర్గం ఎన్నిక

**బెజ్జంకి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** మండల నూతన గ్రామ పంచాయతీ సిఐటియూ కార్మిక కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించినట్లు సిఐటియూ జిల్లా నాయకులు తిప్పారపు శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన ఎన్నికల్లో మండలాధ్యక్షుడిగా బోనగిరి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా మాతంగి రవి, కోశాధికారిగా శివకుమార్, ఉపాధ్యక్షుడిగా బోనగిరి బాబు, కార్యదర్శిగా దీటీ కనకవ్వ, సహాయ కార్యదర్శులుగా శ్రీనివాస్, మాసం శ్యామల, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల నాయకులు సంఘం ఎల్లయ్య, బొమ్మిడి సాయికృష్ణ, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు సౌండ్‌మైక్ అందజేత


అనంతుల శ్యాంమోహన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**కొండపాక, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని కొండపాక గ్రామానికి చెందిన అనంతుల శ్యాంమోహన్ అన్నారు. మంగళవారం ఆయన కొండపాక బాలుర ఉన్నత పాఠశాలకు రూ॥ 60 వేల విలువగల సౌండ్‌మైక్ సెట్‌ను అందించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోనే సమజం లో గౌరవ మర్యాదలు లభిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకొని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని కోరారు. ప్రతి విద్యార్థి బాల్య దశనుండె క్రమ శిక్షణ అలవార్చుకొవాలని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో దాస వీరేశం, సంజయ్‌కృష్ణ, హెచ్‌ఎం సముద్రాల శ్రీనివాస్, పిడి భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీలత, భోభరాణి, విజయలక్ష్మి, అశోక్, తిరుపతి, రవీందర్‌రెడ్డి, బాలకిషన్, సాభీర్ హుస్సేన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఓసాట్ బృందం

**హత్నూర, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** హత్నూర మండలం సిరిపురం ప్రభుత్వ పాఠశాలను మంగళవారం వన్ స్కూల్ ఎట్ టైం(ఓసాట్) బృందం సందర్శించింది. సిరిపుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు గదులు నిర్మించిన ఈ సంస్థ ముత్తంగి, సిరిపుర ఉన్నత పాఠశాలలను మేడ్వాన్ డైరెక్టర్ హెచ్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆన్ ఫైట్ టెక్నాలజీ కంపెనీ ప్రతినిధి మాధవి ఓసార్ట్ ప్రతినిధి నరసింహారావు పాఠశాలలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో సిరిపురం ప్రధాన ఉపాధ్యాయురాలు మంజుల ముత్తంగి ప్రధాన ఉపాధ్యాయురాలు శారద, సిరిపురం మాజీ సర్పంచ్ మచ్చ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


సిరిపురం పాఠశాలను సందర్శించిన ఓసాట్ బృందం సభ్యులు

# ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** ఇంటర్మీడియట్ పరీక్షలను విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో రాసేలా పకడ్బంధీగా ఏర్పాట్లు చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఇంటర్మీడియట్ పరీక్షల ఏర్పాట్లు నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన జూమ్ సమావేశం ద్వారా దిశా నిర్దేశం చేసి మాట్లాడారు. జిల్లాలో ఈనెల 25 నుంచి మార్చి 18 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్షలకు 20 వేల 41మంది మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 42 పరీక్ష కేంద్రాలలో పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 9946, రెండో సంవత్సరం విద్యార్థులు 10095 పరీక్షలకు హాజరుకానున్నారని వివరించారు. పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించడానికి వివిధశాఖలకు కేటాయించాని విధులను వంద శాతం నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవడానికి రూరల్ ప్రాంతాల నుంచి ఉదయం 7 గంటల నుంచి ప్రత్యేక బస్సులు నడిపించాలని ఆర్టీసి అధికారులను ఆదేశించారు. 42 పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు పనిచేయాలని అన్ని గదుల్లో మంచి వెలుతురు వచ్చేలా ఏర్పాటు చేయాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ఎలాంటి విద్యుత్ కొరత లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. అన్ని సెంటర్‌లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ఒక ఎఎన్‌ఎంను అందుబాటులో ఉంచాలని డిఎం అండ్ హెచ్‌ఓను ఆదేశించారు. అన్ని సెంటర్లలో ఎక్కడా ఇన్విజిలేటర్ కొరత రాకుండా ఎస్‌జిటి ఉపాధ్యాయులను కేటాయించాలని డిఈవోను ఆదేశించారు. జిల్లాలో 163 ఆఫ్ బిఎన్‌ఎస్ చట్టాన్ని అమలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అందరూ అధికారులు సమన్వయంతో ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ అధికారి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఉమామహేశ్వరస్వామి కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం, హాజరైన భక్తులు

# కనుల పండువగా ఉమామహేశ్వరుల కళ్యాణం

**మర్కుక్, ఫిబ్రవరి 17 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ గ్రామంలోని శ్రీఉమామహేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీ ఉమామహేశ్వరుల వివాహ వేడుకను ఆకాశమంత పందిరి, భూదేవి అంత చాపలు పరిచి.. మామిడి తోరణాలు, పూలతో అల్లిన పందిరి, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, సన్నాయి రాగాలు, అశేష భక్తజనం సమక్షంలో కన్నుల పండుగగా జరిగింది. ముక్కోటి దేవతలు, పంచభూతాల సాక్షిగా, అర్చకులు, ఆలయ ధర్మకర్త గుండంబట్ల వెంకటనరసింహశర్మ వేదమంత్రాల నడుమ ఉదయం 11.30 గంటలకు బ్రహ్మోత్సవాల నిర్వాహకుల ఆధ్వర్యంలో కళ్యాణ క్రతువు నిర్వహించారు. అంతకుముందు ఆలయ పూజారులు బ్రహ్మోత్సవాల నిర్వాహకులు ఉమామహేశ్వర ఆలయం నుండి కళ్యాణ మండపానికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, భాజా భజంత్రీల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చి ఆది దంపతులకు సమర్పించారు. స్వామివారి కళ్యాణం సందర్భంగా ఆలయ పరిసరాలు శివనామ స్మరణతో మార్మోగాయి. ఈ వివాహ వేడుకకు హాజరైన భక్తులకు గ్రామానికి చెందిన కొంరెడ్డి మల్లారెడ్డి సరోజన దంపతుల ఆధ్వర్యంలో మహా ప్రసాదం అందజేశారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా గ్రామ సర్పంచ్ కొండల్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ బల్లి శ్రీనివాస్‌గుప్త, బ్రహ్మోత్సవాల నిర్వాహకులు మరియు ఉమామహేశ్వరుల ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. కళ్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి మంగమ్మ రాంచంద్రం, మాజీ ఎంపిపి బాల్‌రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, గ్రామ మాజీ సర్పంచ్ రాములుగౌడ్, మాజీ ఎంపిటిసి నరేందర్, నాయకులు దుద్దెడ నర్సింలు, మహేందర్‌రెడ్డి, కుమ్మరి లక్ష్మయ్య, లింగని రాములు, కనకయ్య, యాదవరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, రుక్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి, సురేష్‌గౌడ్, రాముగౌడ్, ఉమామహేశ్వర ట్రస్టు సభ్యులు, స్టార్ యూత్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

# అసంపూర్తిగా నిలిచిపోయిన పంచాయతీ భవనం


అసంపూర్తిగా నిలిచిపోయిన రంగాయిపల్లి గ్రామ పంచాయతీ భవనం

**చిన్నకోడూరు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రంగాయిపల్లి గ్రామాన్ని ఏడు సంవత్సరాల క్రితం నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు కృషితో గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.20 లక్షల నిధులు కేటాయించారు. గ్రామపంచాయతీ భవనం పనులు ప్రారంభించి ఐదేళ్ల గడిచినా నేటికి అసంపూర్తిగానే మిగిలి ఉంది. రంగాయిపల్లి గ్రామ పంచాయతీకి ఇద్దరు సర్పంచ్‌లు పదవి చేపట్టిన ఇప్పటికీ సొంత భవనంలోకి రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోవడంతో గ్రామంలోని పాల కేంద్రం భవనంలో గ్రామ పంచాయతీ భవనం ఏర్పాటు చేసి ప్రజలు సేవలు అందిస్తున్నారు. భవన నిర్మాణానికి కేటాయించిన నిధులు సరిగా రాకపోవడంతోనే భవన నిర్మాణ పనులు నిలిచిపోయినట్లు ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా హరీష్‌రావు స్పందించి అసంపూర్తిగా నిలియిపోయిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుసుమ నిర్మల రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి సరిపడా నిధులు ఉన్నాయని తెలిపారు.

కాంట్రాక్టర్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు పూర్తి చేయాలని పలు మార్లు కాంట్రాక్టర్‌కు చెప్పిన ఫలితం లేదన్నారు.

# కమనీయం....రమణీయ రథోత్సవం

### దుర్గమ్మ నామస్మరణలతో మార్మోగిన ఏడుపాయల.... మూడవ రోజు అదే జోరు.. దుర్గమ్మ సేవలో భక్తగణం...

**పాపన్నపేట, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** ఏడుపాయల దండకారణ్యం దుర్గమ్మ నామస్మరణతో మార్మోగింది. మూడవరోజు మంగళవారం కన్నులు మిరుమిట్లు గొలిపే విధంగా రథోత్సవం జరిగింది. రథోత్సవాన్ని ఇఒ వీరేశం తహసీల్దార్ సతీష్‌లు నగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన బొట్టు దారులైన పటేల్ వతన్‌గల గంగారెడ్డి గారి సాయిరెడ్డి ఇంటికి చేరుకొని బొట్టుసమర్పించి రథోత్సవ కార్యక్రమానికి 18 బాటల వారితోకలిసి రావాలని కోరడంతో ఆయన పనిబాటల వారితో కలిసి రాజగోపురంవద్ద గల ముత్యాలమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన చవడి వద్ద కూర్చుంటారు. అత్యంత్య ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కారక్రమం ముందుగా, ఇఒ వీరేశం ఆనవాయితీప్రకారం రాజగోపురంవద్దఉన్న నాగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన పెద్ద పటేల్ వద్దకు డప్పు చప్పుళ్లు. మెళతాళాల మధ్య ఎనోమెంట్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం రెవెన్యూ అధికారులను ఎదుర్కొని అమ్మవారి గుడివద్దకు వెళ్లి అక్కడి నుండి దుర్గమ్మ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా రథం వద్దకు ఎదుర్కొని వచ్చారు. అనంతరం 18 కులాలకు చెందిన పనిబాటల వాళ్ల రథం ముందు పట్టుపరిచి మంత్రాలతో దండకాలు వేస్తూ అన్నం ప్రతం పట్టుపోశారు. అనంతరం దుర్గమ్మ నామ స్మరణలతో రథంలాగే కార్యక్ర మంరథం గుండు నుండి రాత్రి 9 గంటలకు ప్రారంభం కాగా రాజ గోపురం వరకు 12గంటల వరకు కొనసాగింది.

**బోనమెత్తిన జోగినులు...ఆకట్టుకున్న నృత్యాలు..**

డప్పుల దరువులు, బోనమెత్తుకొని జోగినుల లయబద్దపు నృత్యాలు యువకుల కేరింతల మధ్య జోగినులు ఇలవేల్పు వనదుర్గమ్మకు బోనాలు సమర్పించారు. సోమవారం అర్ధరాత్రి జోగిని శ్యామల అమ్మవారికి బోనం సమర్పించేందుకు శిరసున బోనం ఎత్తుకుని బ్యాండు దరువులకు నృత్యం చేస్తూ అమ్మవారి ఆలయం వరకు తీసిన బోనం భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం జోగిని శ్యామల అమ్మవారికి బోనం సమర్పించి పూజలు నిర్వహించగా పూజారులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం జోగిని శ్యామల నాట్యం భక్తులకు ఎంతగానో ఆకట్టుకున్నాయి.



**ఏరులై పారిన మద్యం...**

ఏడుపాయలలో మద్యం ఏరులై పారింది. బహిరంగంగానే కొట్టులలో అన్ని రకాల మద్యం సీసాలు విక్రయాలు జరిగాయి. మద్యం అక్రమ అమ్మకాలను అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినెట్లు విధులు నిర్వహించారు. ఏడుపాయలలో నిర్వహించే విందులో పాల్గొని మద్యం తాగి స్నానమాచరించడానికి వెళ్ళి నీటి ప్రమాదాలతో ఎంతోమంది మృత్యువు ఒడిలోకిచేరారు. మామూళ్ల మత్తులో సంబంధితశాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంవల్ల మద్యం విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. జాతరలో మద్యం ఏరులై పారిన సంబంధిత శాఖ అధికారులు ఒక్క కేసు నమోదుచేయకపోడం వారి పనితనానికి నిదర్శనంగా నిలిచింది.

**దుర్గమ్మ సన్నిధిలో రంగంపేట పీఠాధిపతి..**

జగత్ జనని కోరికలు తీర్చే కొంగుబంగారు తల్లిగా విరాజిల్లుతున్న ఏడుపాయల వన దుర్గ భవాని మాత ను రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి దర్శించుకున్నారు. జాతర మహోత్సవాల మూడవ రోజు మంగళవారం మాధవానంద సరస్వతి ఏడుపాయలకుచేరుకోగా ఆలయ ఇఒ వీరేశం పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు వన దుర్గ భవాని మాత ను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు ఆశీర్వాదాలు అందజేశారు.


అటవీకళాశాలలో మొక్కను నాటి నీళ్లు పోస్తున్న మంత్రి కొండా సురేఖ

## రాష్ట్రంలో అడవుల విస్తరణకు కృషి

### అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ

**ములుగు, ఫిబ్రవరి 17 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో అడవుల విస్తరణకు ప్రభుత్వం కృషిచేస్తుందని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంగళవారం ములుగులోని అటవీ కళాశాల దశాబ్ధి ఉత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొని కళాశాల ఆవరణలో మొక్కను నాటి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అటవీ కళాశాల దశాబ్ధి ఉత్సవాలకు కళాశాల డీన్ కృష్ణ తనను ముఖ్య అతిథిగా ఆహ్వానించడం చాలా ఆనందంగా ఉందన్నారు. పది సంవత్సరాలు పూర్తి చేసుకోవడం కేవలం కాల పరిమితి మాత్రమే కాదని, అది దూరదృష్టి, కృషి, సమిష్టి శ్రమ ఫలితమని పేర్కొన్నారు. కళాశాలలో అధ్యాపకుల నియామకాలను త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. విద్యార్థుల రిజర్వేషన్ల పెంపుతోపాటు అటవీ అధికారుల నియామకాలలో రిజర్వేషన్ల పెంపునకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ డి.రాజిరెడ్డి, అటవీ శాఖ ఉన్నతాధికారులు డాక్టర్ ప్రియాంక వర్గీస్, డాక్టర్ సువర్ణ, డాక్టర్ ఎస్‌జె. ఆశ, జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు సి.శ్రీధర్‌రావు, ఎన్.కవిత, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్.వెంకటాపూర్‌లో ట్రైనీ అధికారుల పర్యటన


పల్లె ప్రకృతివనంను పరిశీలిస్తున్న ట్రైనీ గ్రూపు 1 అధికారులు

**రామాయంపేట, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** రామాయంపేట మండలం ఆర్.వెంకటాపూర్ గ్రామంలో మంగళవారం ట్రైనీ గ్రూపు 1 అధికారులు సందర్శించారు. పంచాయతీ పరిపాలన, మహిళా సంఘాల పొదుపు, ఉపాధి హామి సంక్షేమ పథకాల అమలు గురించి తెలుసుకున్నారు. నర్సరీతోపాటు డంపింగ్‌యార్డును సందర్శించారు. కార్యక్రమంలో ఎంపిడివో షాజీలొద్దీన్, ఎంపివో రాజేందర్, ఏపీవో శంకర్, కార్యదర్శి శ్యామల పాల్గొన్నారు.

**పాపన్నపేట మండలలో...**

**పాపన్నపేట, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** పాపన్నపేట మండలం మల్లంపేట గ్రామంలో మంగళవారం ట్రైనీ గ్రూపు 1 అధికారులు పర్యటించారు. గ్రామస్థాయిలో పంచాయతీ పరిపాలన, మహిళా సంఘాల పొదుపు, ఉపాధిహామి, తదితర సంక్షేమ పథకాల అమలు గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధికారులు విజయ్‌కుమార్, ప్రియాంజలి, ఆంజనేయులు, శంతన్ కుమార్ రెడ్డి, హిటన ఫైజ్, సాయికమల్లు పాల్గొన్నారు.

## వనదుర్గమ్మ సన్నిధిలో సునీతారెడ్డి

**పాపన్నపేట, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** ఏడుపాయల వనదుర్గ భవాని మాతను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి దర్శించుకున్నారు. ఆమె మంగళవారం ఏడుపాయల కు చేరుకోగా ఆలయ ఇఒ వీరేశం, పూజారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు అనంతరం ఆమె అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు. వీరికి ఆలయ ఇఒ వీరేశం శాలువాతో సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

## సస్యరక్షణ చర్యలతో అగ్గి తెగులును అరికట్టాలి

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** వరి పైరుకు తీవ్ర నష్టం కలిగించే అగ్గి తెగులును ప్రారంభ దశలోనే గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అరికట్టవచ్చని మండల వ్యవసాయ అధికారి బి.శ్రీనాథ్ అన్నారు. మండల పరిధిలోని బక్రిచెప్యాల గ్రామంలో మెదుదుల నర్సయ్య వరి పొలాన్ని సందర్శించి అగ్గి తెగులు సోకిన వరి పైరును పరిశీలించి రైతుకు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాత్రి వేళ ఉష్ణోగ్రత తక్కువగా ఉండడం ఆకులపై మంచు ప్రభావం నత్రజని అధిక వినియోగం వలన వరిలో అగ్గి తెగులు వస్తుందని తెలిపారు. ఆకులపైన నూలు కండె ఆకారంలో బూడిద రంగు మచ్చల చుట్టూ ఇటుక రంగులో ఉండే అగ్గి తెగులు లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించి నివారించకపోతే తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందన్నారు. నివారణ కోసం ట్రైసైక్లాజోల్ 120 గ్రా. లేదా ట్రిప్లాక్సిస్ట్రోబిన్, టెబుకోనజోల్ 90 గ్రా. ద్రావణాన్ని లేదా పికాక్సిస్ట్రోబిన్, ట్రైసైక్లాజోల్ 400 మి.లీ. ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి పైరుపై పిచికారీ చేసుకోవాలన్నారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం

**కొండపాక, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** మండల పరిధిలోని శ్రీసాయి సత్యయ వెల్‌నెస్ సెంటర్ అధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 25 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గజ్వేల్ డాక్టర్ సాయినాథ్‌రెడ్డి(ఎముకల వైద్యులు), వైద్యశిబిరానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఉచిత వైద్యశిబిరాలు ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తామన్నారు.

## విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేయడం అభినందనీయమని చందంపేట సర్పంచి నాయిని ప్రవీణ్ కుమార్ అన్నారు. మండల పరిధి చందంపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు భాగ్యనగరానికి చెందిన వీణ విదుష మంగళవారం సైకిళ్లను పంపిణీ చేశారు. విద్యార్థులు బాగాచదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. సర్పంచి ప్రవిణ్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ రుద్రారం నుండి చందంపేటకు రావడానికి ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు ఈ సైకిళ్లు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గోంగలూరులో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం

**కంది, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండల పరిధిలోని గోంగలూరులో కంది మండల పరిధిలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిధిలోని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 7 రోజుల పాటు (ఈ నెల 23వ తారీఖు వరకు) నిర్వహించే ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్.స్వామి ఎన్‌ఎస్‌ఎస్ జెండాను ఆవిష్కరించి గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వ హించారు. విద్యార్థులు సమాజ సేవ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజ అభ్యున్నతికి తమవంతు సేవలు అందించాలని కళాశాల అసో సియేట్ డీన్ డాక్టర్ ఆర్.స్వామి సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవ సాయ అధికారి డాక్టర్ వైద్యనాథ్, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్లు డాక్టర్ జె. వీరన్న, డాక్టర్ బాలచందర్, ప్రజాప్రతినిదులు, సొసైటీ మాజీ చైర్మన్, న్యాయవాది శ్రీనివాస్, ఎంపిటిసి మాజీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి మంజికర్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, ఫిబ్రవరి 17 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన బ్యాగరి బాలమల్లు అనారోగ్యం కారణంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ తిరుమల్‌రెడ్డి మంగళవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయనతోపాటు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కనకయ్యగౌడ్, గ్రామ అధ్యక్షుడు క్రాంతికుమార్, కొండపోచమ్మ డైరెక్టర్ కిషన్, దేగల నర్సింలు, లక్ష్మణ్, స్వామి, కనకయ్య, తలారి మల్లయ్య ఉన్నారు.

## ప్రజల తీర్పే ఘనవిజయం
**-చిమ్ముల సంధ్యగోవర్ధన్‌రెడ్డికి అంబేద్కర్‌సంఘం నాయకుల సత్కారం**


చిమ్ముల సంధ్యను సన్మానిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

**గుమ్మడిదల, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**
చిమ్ముల సంధ్యగోవర్ధన్‌రెడ్డి గుమ్మడిదల మున్సిపాలిటీలో వైస్‌చైర్మన్‌గా కౌన్సిలర్‌గా ఘనవిజయం సాధించడంతో సంబరాలు వెల్లివిరిశాయి. ఈ విజయాన్ని పురస్కరించుకొని అంబేద్కర్ సంఘం నాయకులు అధ్యక్షుడు తుడుం రవి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. 15వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందిన పొన్నాల సులోచన పూలమాలలు వేసి, శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు అంబేద్కర్‌సంఘం నాయకులు, ఉపాధ్యక్షులు దప్పు శ్రీనివాస్, కుమార్, తుడుం రాజు, సుధాకర్, నర్సింలు, దప్పు గణేష్, కార్యకర్తలు, మహిళా నాయకులు, స్థానిక ప్రజలు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలి
**-వార్డుల సభ్యులతో ఎంపిడిఓ శంకర్**


వార్డుసభ్యులకు విధినిర్వహణపై అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఓ శంకర్

**చౌటకూరు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**
ప్రభుత్వం సూచించిన ప్రకారం నిబంధనలు పాటిస్తూ నిర్వహించాలని కొత్తగా ఎన్నికైన ఆయా గ్రామాల్లోని వార్డు సభ్యులకు ఎంపిడిఓ శంకర్ సూచించారు. మండలపరిధిలోని 15 గ్రామ పంచాయతీల్లోని 134 మంది వార్డుసభ్యులకు మండల కేంద్రమైన చౌటకూరులోని రైతువేదికలో రెండు విడతలుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. రెండు విడతలుగా 5 రోజుల చొప్పున వార్డు సభ్యులకు విధినిర్వహణపై శిక్షణ ఇస్తారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటివిడతలో మొదటిరోజైన మంగళవారం 7 పంచాయతీల్లోని 66మంది వార్డుసభ్యులకు శిక్షణ తరగతులను ఎంపిడిఓ ప్రారంభించి పలు సూచనలు చేశారు. రెండవవిడత శిక్షణ కార్యక్రమాలు ఈనెల 23వతారీఖు నుంచి ప్రారంభిస్తామని ఎంపిడిఓ శంకర్ వివరించారు. కార్యక్రమంలో ఎంపిఓ సువర్ణ, ఎన్ఆర్ఈజిఎస్ ఏపిఓ రాంమోహన్, శిక్షకులు క్రిష్టఫర్, వసంత్‌కుమార్, పాండు, ప్రభాకర్‌రెడ్డి, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు


మినీ వాటర్‌ట్యాంక్‌లను పరిశీలిస్తున్న సర్పంచి, పంచాయతీ కార్యదర్శి

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**
రానున్న వేసవి కాలంలో గ్రామస్తులు తాగునీటి ఎద్దడిని ఎదుర్కోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం గ్రామ సర్పంచి జ్యోతిప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, మెకానిక్ మల్లి కిష్టన్నలతో కలిసి గ్రామంలోని మినీ వాటర్‌ట్యాంక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచి జ్యోతిప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలోని మినీ వాటర్‌ట్యాంక్‌లకు అవసరమైతే మరమ్మతులు చేయిస్తామని, ట్యాంక్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీరు వృథాకాకుండా గ్రామస్తులు తగుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## గ్రామాల్లో పర్యటించిన గ్రూప్-1 అధికారులు


బస్వాపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న గ్రూప్-1 అధికారులు

**పుల్‌కల్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**
గ్రూప్-1 అధికారులు 2 బృందాలుగా ఏర్పడి మంగళవారం మండల పరిధిలోని గొంగ్లూర్, బస్వాపూర్ గ్రామాలను పర్యటించి గ్రామాల్లోని అభివృద్ధి పనులను పరిశీలించారు. గొంగ్లూర్‌లో బానోత ఝాఖ, దారవత్ చందన, మొదంపల్లి మహేశ్వరీ, బనావత్ వనజ సిసిఎల్ఎ, సామల సతీష్‌ముదావత్, హనుమంతు ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్, బస్వాపూర్‌లో కె.రజని, యారగని నవీన్ మునిసిపల్, శైలేష్ పూన, గొట్టిపర్తి గాయత్రి, కె.అభినవ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలకు చెందిన అధికారులు పర్యటించారు. క్షేత్రస్థాయిలో అమలవుతున్న పథకాలపై ఆరాతీశారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, తాగునీరు, మురుగు కాల్వలు, పారిశుధ్యనిర్వహణను అడిగితెలుసుకున్నారు. కూలీలతో ముఖాముఖిగా చర్చించారు. డంపింగ్‌యార్డు, పల్లెప్రకృతివనాలను, వైకుంఠ ధామాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ఆనందమేరీ, తహసీల్దార్ కృష్ణ, పిహెచ్‌సి డాక్టర్ సాయికిరణ్, ఎంపిఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఈజిఎస్ ఎపిఓ సంతోష్, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ దావుద్, బస్వాపూర్ సర్పంచి భూంరెడ్డి, యాదగిరి, వార్డుసభ్యులు ఉన్నారు.

## నర్సాపూర్ మున్సిపల్ అభివృద్ధికి కృషి చేస్తా
**-మున్సిపల్ వైస్ చైర్మన్ వనముల బుచ్చేష్‌యాదవ్**

**నర్సాపూర్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మున్సిపల్ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని నర్సాపూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ వనముల బుచ్చేష్‌యాదవ్ అన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన వనముల బుచ్చేష్‌యాదవ్ మాట్లాడుతూ నర్సాపూర్ మున్సిపల్ అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. మెదక్ ఎంపి రఘునందన్‌రావు సహకారంతో నర్సాపూర్ మున్సిపాలిటీలో ఏయేసమస్యలు ఉన్నాయో, వాటిని పరిష్కరించేందుకు, అభివృద్ధి పనులకుగాను నిధులు మంజూరు చేయించి పట్టణ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. తనను ఆదరించి గెలిపించిన 13వవార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా మిగతా కౌన్సిలర్ల సహకారంతో మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా తనను ఎన్నుకున్నందుకు మరిన్ని సాంఘికసేవ, సంక్షేమకార్యక్రమాలు చేసేభాగ్యం కలిగిందన్నారు. ఈమేరకు అందరికీ అందుబాటులో ఉండి ఎల్లవేళలా నిస్వార్థంగా సేవచేయడానికి సిద్ధంగా ఉన్నానని, అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన డిసిహెచ్ఎస్


ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవల గురించి తెలుసుకుంటున్న డిసిహెచ్ఎస్ షరీఫ్

**జోగిపేట, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**
జోగిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిని డిసిహెచ్ఎస్ డాక్టర్ షరీఫ్ మంగళవారం తనిఖీ చేశారు. సోమవారం సాయంత్రం మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈ ఆసుపత్రిని తనిఖీ చేసిన సందర్భంలో ఒకే డాక్టర్ ఉండటం పట్ల వైద్యశాఖ ఉన్నతాధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు హాజరుకాని డాక్టర్లను సస్పెండ్ చేయాలంటూ ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో ఎవరెవరు విధులు నిర్వహిస్తున్నారనే వివరాలను ఆరా తీసేందుకు వచ్చిన డిసిహెచ్ఎస్ షరీఫ్ ఆసుపత్రిలోని అన్ని వార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు సక్రమంగా అందుతున్నాయా లేవా అంటూ అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తమకు తెలపాలని ఆయన రోగులకు సూచించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం ఎవరెవరు విధుల్లో ఉన్నారు? ఎవరు గైర్హాజరయ్యారు? అనే విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి, అందుకు సంబంధించిన నివేదికను వైద్యశాఖ ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉదాసీనంగా వ్యవహరించే ప్రశ్నేలేదని డిసిహెచ్ఎస్ డాక్టర్ షరీఫ్ పేర్కొన్నారు.

## ముందే చెప్పాం.. అమలు చేశాం.. సాధించాం
**-ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**


కౌన్సిలర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**
పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలలో గులాబీ జెండా ఎగరవేసి, మాజీ సిఎం కెసిఆర్‌కి పుట్టినరోజు కానుకగా అందించామని, ఇది తన జీవితంలో మర్చిపోలేని రోజని, ఇందుకు సహకరించిన కార్యకర్తలను సంపూర్ణ నమ్మకంతో ఆశీర్వదించిన ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ ఫంక్షన్ హాలులో ఇటీవల నూతనంగా ఎన్నికైన గడ్డపోతారం, జిన్నారం, ఇంద్రేశం మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, పాలకవర్గం సభ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ వారిని ఘనంగా సన్మానించి అభినందించారు.

## మున్సిపల్ చైర్మన్‌ను సన్మానించిన సర్పంచి


మున్సిపల్ చైర్మన్‌ను సన్మానిస్తున్న చౌటకూరు సర్పంచి

**చౌటకూరు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**
అందోలు-జోగిపేట మున్సిపల్ చైర్మన్ సోమిరెడ్డి కృష్ణారెడ్డిని మండల కేంద్రమైన చౌటకూరు సర్పంచి పార్కల రాంరెడ్డి మంగళవారం ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షులు కలాలి రామాగౌడ్, నాయకులు వర్కల రమేష్, దమ్మీ కృష్ణ, గంగారం, గోరేమియా, జైపాల్‌రెడ్డి, అశోక్, లక్ష్మయ్య, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

## మంచితనానికి కలిసొచ్చిన అదృష్టం
**-యూనూస్‌ను వరించిన చైర్మన్ పీఠం**

**జహీరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**
మంచితనం ఉంటే అదృష్టం ఎప్పుడైనా తలుపు తడుతుందని, కలిసొస్తుందన్నది మున్సిపల్ చైర్మన్ ఎన్నికతో నిరూపితమయింది. జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్‌గా కాంగ్రెస్ కౌన్సిలర్ మహమ్మద్ యూనూస్ ఎన్నికవడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. కౌన్సిలర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు ఊహించని విధంగా మంగళవారమే యూనూస్ పేరును చైర్మన్ పదవికి ప్రతిపాదించగా ఎంఐఎం, ఇండిపెండెంట్ కౌన్సిలర్ల మద్దతుతో ఎలాంటి రాజకీయ పలుకుబడి లేకున్నా ఒసాధారణ పార్టీ కార్యకర్తగా ఉన్న యూనూస్ మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికవడంతో మంచితానానికి ఓటమి లేదని నిరూపితమయింది. 2014లో జరిగిన మున్సిపల్ ఎన్నికలో బసవేశ్వర వీధి (ప్రస్తుతం 15వ వార్డు) నుంచి కాంగ్రెస్ కౌన్సిలర్‌గా ఎన్నికైన యూనూన్ మరో మారు అదే వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి కౌన్సిలర్‌గా ఎన్నికై అనూహ్యంగా చైర్మన్ పీఠం కైవసం చేసుకోవడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. జహీరాబాద్ పట్టణ అభివృద్ధికి శక్తివంచన లేకుండా తన వంతు కృషి చేసి ప్రజలు రుణాన్ని తీర్చుకుంటానని మున్సిపల్ చైర్మన్ యూనూస్ పేర్కొన్నారు.

## పదవి లేకున్నా ప్రజాసేవలోనే ఉంటా
**-రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నీలం మధుముదిరాజ్**


నీలం మధు నాయకులతో మాట్లాడుతున్న దృశ్యం

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**
రాజకీయాల్లో పదవులు ముఖ్యంకాదని అధికారం ఉన్నా, లేకపోయినా ప్రజాసేవలో నిమగ్నమవుతామని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధుముదిరాజ్ స్పష్టంచేశారు. మంగళవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్‌లో పలు వార్డులలో స్థానిక కౌన్సెలర్ నీలం కవిత, సంతోషదస్తగిరి, జ్యోతిగోపాల్‌లతో కలిసి పర్యటించి ఎన్నికల సందర్భంగా గుర్తించిన సమస్యలను తీర్చే విషయంలో భాగంగా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో మాజీ వార్డుసభ్యులు వెంకటేష్, మురళి, విఠల్, శ్రీను, విష్ణు, అంజిరెడ్డి, స్థానికనేతలు, ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా మున్సిపాలిటీ అభివృద్ధికి కృషిచేస్తా
**-నూతన మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మీరాజుయాదవ్**


మాట్లాడుతున్న నూతన మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మీరాజుయాదవ్

**నర్సాపూర్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**
పార్టీలకు అతీతంగా నర్సాపూర్ మున్సిపల్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నర్సాపూర్ నూతన ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మీ రాజుయాదవ్ అన్నారు. మంగళవారం నర్సాపూర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తనను కౌన్సిలర్‌గా గెలిపించిన ఐదవ వార్డు ప్రజలకు, మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నుకున్న కౌన్సిలర్లకు ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజుయాదవ్ అన్నారు.

## సోమేశ్వరస్వామికి మొక్కులు చెల్లింపు


చిన్నశంకరంపేటలో బోనం ఎత్తుకున్న మైనంపల్లి వాణి

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**
చిన్నశంకరంపేట పట్టణంలోని సోమేశ్వరస్వామి ఆలయ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. భక్తులు ఉదయం నుండి స్వామివారికి జరిగిన ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తల్లి, మైనంపల్లి వాణి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి బోనం ఎత్తుకొని మొక్కులను సమర్పించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచి చంద్రశేఖర్, రాజిరెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

# అక్రమార్కుల చెరలో కొన్రాజ్‌కుంట

**-కబ్జాకు గురవుతున్న కుంట**
**-కుంట కట్టను జెసిబిలతో త్రవ్విన వైనం**
**-అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదంలో ప్రజల జీవనాధారం**


ఆవేదన వ్యక్తం చేస్తున్న కుంటపై ఆధారపడిన మత్స్యశాఖ కుటుంబ సభ్యులు

**గుమ్మడిదల, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం వార్డులో ఉన్న సర్వే నం.261/7లో సుమారు 6.34 గుంటల విస్తీర్ణంలో ఉన్న కొన్రాజ్‌కుంట అక్రమార్కుల చెరలో చిక్కుకుంది. కుంటను పూర్తిగా చదును చేసి కబ్జా చేసేందుకు కొందరు వ్యక్తులు యత్నిస్తున్నారని స్థానిక మత్స్యకారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుంటలోని నీటిని జెసిబిలతో కట్టనుత్రవ్వి వెలుపలికి మళ్లించి, అనంతరం మొరం పోసి భూమిని చదును చేయడం ద్వారా కుంటను పూర్తిగా మాయం చేయాలన్న కుట్ర జరుగుతోందని ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ చర్యల వల్ల సుమారు 150 మత్స్యకార కుటుంబాల జీవనాధారం ప్రమాదంలో పడింది. మత్స్యశాఖ అధ్యక్షుడు దర్గా వీరస్వామి, అధ్యక్షుడు మొర్ర యాదగిరి, ప్రధాన కార్యదర్శి రొయ్యపల్లి బాలేష్‌లు మాట్లాడుతూ, కొన్రాజ్‌కుంటపై ఆధారపడి వందల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. మున్సిపల్ ఎన్నికల సమయంలో పరిస్థితిని ఆసరాగా తీసుకుని కొంతమంది అక్రమార్కులు కుంటభూమిని కబ్జాచేయడానికి యత్నిస్తున్నారు. ఇది ప్రజల జీవన హక్కుపై దాడి అని మండిపడ్డారు.

స్థానికులు దర్గా బిక్షపతి, శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ హైడ్రా అధికారులు వెంటనే స్పందించి అక్రమపనులను నిలిపివేసి కుంటను పరిరక్షించాలి అని డిమాండ్ చేశారు. ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. జీవనాధారమైన కొన్రాజ్ కుంటను కాపాడాలని, అక్రమ కబ్జాలను వెంటనే అడ్డుకోవాలని స్థానికులు అధికార యంత్రాంగాన్ని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో వీరేష్, దేశబోయిన శ్రీనివాస్, దశరథ, మస్కూర్ సంజీవ్, మస్కూర్ వెంకటేష్, దర్గా నరేష్, చింతగుడి అశోక్, గుండ్ల విజయ్ కుమార్, మొర్రో సత్యనారాయణ, దేశబైనా వెంకటేష్, చింతగుడి కుమార్, చింతగుడి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లైఓవర్‌పై లైట్ల ఏర్పాటుకు సహకరించండి
**-జోగిపేట సిఐని కోరిన సర్పంచి పార్కల రాంరెడ్డి**


సిఐకు వినతి పత్రం అందచేస్తున్న సర్పంచి రాంరెడ్డి

**చౌటకూరు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన చౌటకూరువద్ద సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161వ జాతీయరహదారిపై నిర్మించిన ఫ్లైఓవర్ వంతెనపై లైట్లు అమర్చేందుకు సహకరించాలని చౌటకూరు సర్పంచి పార్కల్ రాంరెడ్డి మంగళవారం జోగిపేట సిఐ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సర్పంచి పార్కల రాంరెడ్డి మాట్లాడుతూ ఫ్లైఓవర్ వంతెనపై లైట్లు లేకపోవడంతో చీకటిలో తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. జాతీయరహదారి నిర్వహణ కాంట్రాక్టర్ లైట్లు అమర్చేందుకు పోలీసుశాఖసిఫారసు తప్పనిసరిగా అవసరమని ప్రాజెక్టు డైరెక్టర్ సూచించినట్లు గుర్తుచేశారు. లిఖితపూర్వకంగా వినతి అందచేస్తే పరిశీలిస్తామన్నారని పేర్కొన్నారు. పోలీసుశాఖ తరపున లిఖితపూర్వంగా రాసి లైట్ల ఏర్పాటుకు చొరవతీసుకోవాలని వినతి చేశామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు కలాలి రామాగౌడ్, వర్కల రమేష్, వార్డుసభ్యులు జైపాల్‌రెడ్డి, గోరేమియా, బాలరాజ్, నాయకులు కొజ్జ లక్ష్మయ్య, చక్రపాణి, దమ్మీ కృష్ణ, బేగరి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ్‌రెడ్డిని సన్మానించిన బిఆర్ఎస్ నేతలు


ఆదర్శ్‌రెడ్డిని సన్మానిస్తున్న బిఆర్ఎస్ నేతలు

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**
నియోజకవర్గం పరిధిలోని జిన్నారం, ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని బిఆర్ఎస్ నాయకులు, బిఆర్ఎస్ కౌన్సిలర్లు మంగళవారం పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి వెన్నవరం ఆదర్శ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాలతో సత్కరించారు. ఎన్నికల్లో గెలిచేవారికే టికెట్లు ఇప్పించడంతోపాటు విజయంసాధించేలా ప్రణాళికలు రూపొందించి బిఆర్ఎస్‌ను విజయతీరానికిచేర్చిన ఆదర్శ్‌రెడ్డికి రుణపడి ఉంటామని కౌన్సిలర్లు ఆనందం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జిన్నారం, ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్‌లు సక్కిర్తి జనార్దన్, మాటె శ్రీలత, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, జిన్నారం మండల బిఆర్ఎస్ అధ్యక్షులు రాజేష్, నాయకులు జగన్నాథ్‌రెడ్డి, ఆయా మున్సిపాలిటీల బిఆర్ఎస్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## దృఢసంకల్పంతో విద్యార్థులు ముందుకుసాగాలి
**-కళాశాల వార్షికోత్సవంలో ఎంఈఓ లక్ష్మణ్**


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మణ్

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**
విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో, దృఢసంకల్పంతో ముందుకుసాగాలని ఎంఈఓ లక్ష్మణ్ సూచించారు. మండలకేంద్రమైన అల్లాదుర్గంలోని ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో మంగళవారం కళాశాల వార్షికోత్సవాన్ని, ద్వితీయసంవత్సరంలో విద్యను అందుకుంటున్న విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాలను విద్యార్థులు ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ లక్ష్మణ్ హాజరయ్యారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ తుకారాం అధ్యక్షత వహించారు. క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థి కౌన్సిలర్ నరసింహారెడ్డి, అధ్యాపకులు శ్యామ్‌రావు, రవికుమార్, రవీందర్, శివకుమార్, డాక్టర్ దత్తు, శంకర్, స్రవంతి, ప్రవీణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## చలో హైద్రాబాద్


చలో హైద్రాబాద్ కార్యక్రమానికి బయల్దేరిన గీత కార్మికులు

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**
కల్లుగీత కార్మికసంఘం ఆధ్వర్యంలో గీతకార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ హైద్రాబాద్‌లోని ఇందిరాపార్క్‌వద్ద నిర్వహిస్తున్న నిరాహారదీక్షకు గౌడ కులస్థులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా గౌడనాయకులు మాట్లాడుతూ, గౌడకులస్థుల సంక్షేమంకోసం ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.5వేల కోట్లు కేటాయించాలని డిమాండ్‌చేశారు. హైద్రాబాద్‌కు మండలపరిధిలోని పెద్దాపూర్ నుంచి పెద్దసంఖ్యలో గౌడ కులస్థులు, జిల్లా ఉపాధ్యక్షులు సాయిగౌడ్, కృష్ణగౌడ్, సత్యనారాయణ గౌడ్ తదితరులు తరలివెళ్లారు.

## బ్యూటీ అండ్ వెల్నెస్ శిక్షణలో విద్యార్థులు


బ్యూటీ అండ్ వెల్నెస్ శిక్షణలో విద్యార్థులు

**హవేలీఘనపూర్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**
హవేలీఘనపూర్ మండల పరిధిలోని కూచన్‌పల్లి ఉన్నత పాఠశాలలో పిఎంశ్రీ పథకం కింద 9వ తరగతి విద్యార్థులకు బ్యూటీ అండ్ వెల్నెస్ కోర్సులను ఎంఈఓ హెచ్ఎం మధుమోహన్‌లతో డిఈఓ విజయ ప్రారంభించారు. విద్యార్థులు చదువుతోపాటు వృత్తివిద్య కోర్సులపై శ్రద్ధ వహించి సొంతంగా ఉపాధి పొందేలా ఎదగాలని ఆమె సూచించారు. విద్యార్థుల ఉజ్జ్వల భవిషత్తుకు ఇటువంటి కోర్సులు ఎంతో దోహదపడ్తాయని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మధుమోహన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.